

6వ రోజూ కొనసాగిన సమ్మె



భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న పొరుగుసేవల సిబ్బంది

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని ద్రావిడ విశ్వవిద్యాలయంలో పొరుగుసేవల సిబ్బంది చేపట్టిన సమ్మె గురువారం ఆరో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు భిక్షాటన చేస్తూ విన్నూతరీతిలో నిరసన తెలియజేశారు. ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించి మూడు నెలల బకాయి జీతాలు ఇప్పించాలని వేడుకున్నారు. సంబంధిత అధికారులు వీరి సమస్యలను గుర్తించి పాత బకాయిలతో పాటు వీరికి రావాల్సన అన్ని సదుపాయాలు కల్పించాలని, అంతవరకు తమ సమ్మెను విరమింప చేయమని తెలియజేశారు.

స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను

10 లోపు పూర్తి చేసేందుకు చర్యలు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకరంగ అభివద్ధిలో భాగంగా జిల్లాలలో చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించి అలినేషన్ అడ్వాన్స్ పొజిషన్ ఇచ్చేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధంచేసి పంపాలని, గహనిర్మాణాల పురోగతిలో రోజువారి ప్రగతి ఉండాలని, స్పందన అర్జీలకు సరైన ఎండార్స్మెంట్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో జాతీయ రహదారులు, జగనన్న భూహక్కు- భూరక్ష పథకంలో భాగంగా రీసర్వే, భూహక్కు పత్రాల పంపిణీ, గ్రౌండ్ ట్రూథింగ్, స్పందన, పేదలందరికీ ఇళ్లు, వ్యవసాయం అనుబంధ రంగాలు, పంచాయతీరాజ్ గ్రామీణ అభివద్ధి శాఖల ద్వారా జరుగుతున్న పనుల పురోగతి తదితర అంశాలపై జిల్లాల వారీగా ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సమీక్షించారు. చిత్తూరు జిల్లా సచివాలయం నుండి కలెక్టర్ సగిలి షన్మోహన్, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పాల్గొన్నారు. జిల్లాలో ఫోర్జి మొబైల్ సర్వీసెస్ టవర్స్ ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తించే ప్రక్రియను పూర్తి చేస్తామని, జగనన్న భూహక్కు భూరక్షలో భాగంగా మొదటివిడత రీసర్వే పూర్తయిన గ్రామాలలో సర్వే రాళ్ళునాటే ప్రక్రియను ఈనెల 10వతేదీ లోపు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రెండో విడత రీసర్వేలో గ్రౌండ్ ట్రూథింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్, భూహక్కు పత్రాలు ప్రణాళికబద్ధంగా చేయడం, స్పందన కార్యక్రమంలో అందే అర్జీలను సకాలంలో పరిష్కరించేలా, పర్యాటకశాఖ అభివద్ధిలో భాగంగా జిల్లాకు కేటాయించిన ప్రాజెక్టులకు సంబంధించిన అలినేషన్ ప్రపోజల్స్‌ను త్వరగా పంపుతామని తెలిపారు. అలాగే వైయస్సార్ చేయూత పథకం కింద లబ్ధి పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు అవసరమైన పాడి పశువుల పెంపకంపై దష్టి పెట్టామని, జగనన్న పాలవెల్లువ ద్వారా పాలసేకరణను పెంచేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అర్హులైన వారందరికీ జాబ్‌కార్డులు మంజూరు చేయడం జరుగుతున్నదని కలెక్టర్ వివరించారు.

ఫర్నీచర్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

- రూ. కోటి ఆస్తినష్టం
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆర్డీవో



ఫ్యాక్టరీలో ఎగసి పడుతున్న మంటలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఫర్నిచర్ ఉత్పత్తి ఫ్యాక్టరీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి దగ్ధమైన సంఘటన గురువారం జిల్లా కేంద్రమైన చిత్తూరులోని దర్గా సర్కిల్ సమీపంలో చోటు చేసుకుంది. దాదాపు కోటి రూపాయల ఆస్తినష్టం వాటిల్లింది. దర్గా సర్కిల్ టుటౌన్ పోలీసు స్టేషన్ ఎదురుగా షాదిక్ ఫర్నిచర్ మ్యానిఫ్యాక్చరింగ్ గోడౌన్ ఉంది. ఇందులో కుషన్ బెడ్లు, దీవాన్‌కాట్, సోఫాసెట్లు తదితరాలు తయారు చేస్తారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో మంటలు చెలరేగాయి. గోడౌన్‌లో పనిచేస్తున్న నలుగురు కార్మికులు ప్రమాదాన్ని గుర్తించి బయటకు పరుగులు తీశారు. దట్టమైన పొగలు వ్యాపించడంతో చుట్టుపక్కల వారు పోలీసులను అప్రమత్తం చేశారు. చిత్తూరు, పలమనేరు, పాకాలకు చెందిన అగ్నిమాపక వాహనాలను సంఘటన స్థలానికి తరలించి మంటలను అదుపు చేసేందుకు తీవ్రప్రయత్నం చేశారు. దాదాపు రెండు గంటల పాటు అగ్నిమాపక సిబ్బంది శ్రమించాక మంటలు అదుపులోకి వచ్చాయి. సమీపంలోనే కార్‌పార్కింగ్ ఉండడంతో కార్ పార్కింగ్‌లో ఉన్న వాహనాలు దెబ్బతిన్నాయి. సంఘటన స్థలాన్ని చిత్తూరు ఆర్డీవో రేణుక, డీఎస్పీ శ్రీనివాసమూర్తి చేరుకుని పరిసరాలను పరిశీలించారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ రేణుక

ఈ మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫర్నిచర్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం సంభించిందని తెలియగానే షాదిక్ ఫర్నిచర్ మ్యానిఫ్యాక్చరింగ్ గోడౌన్ యజమాని షాదిక్ తీవ్ర అస్వస్థకు గురైయ్యారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఫర్నిచర్ గోడౌన్ దగ్ధమైందని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని చిత్తూరు ఆర్డీవో రేణుక తెలిపారు. ఈసంఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూ సమస్యలపై దృష్టి పెట్టాలి

జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో ఉన్న రెవెన్యూ సమస్యలపై ప్రధానంగా దష్టి కేంద్రీకరించి న్యాయపరంగా చిక్కులు ఉన్న వాటి విషయంలో తొందరగా పరిష్కారం అయ్యేలా కౌంటర్లు దాఖలు చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తెలిపారు. గురువారం జెసి సమావేశం మందిరంలో హౌసింగ్ పిడి, పద్మనాభం, మండలాల తహశీల్దార్లతో సమావేశమైనారు. ఈసందర్భంగా జెసి వివిధ మండలాలలో ఉన్న కేసుల గురించి తహశీల్దార్‌లతో చర్చించారు. రెవెన్యూ సమస్యలతోపాటు గహనిర్మాణానికి సంబంధించిన సమస్యలున్నాయని అదేవిధంగా పలు అభివద్ధి పథకాలకు సంబంధించి కోర్టులలో కేసులు ఉన్నాయని వాటిపై సకాలంలో స్పందించి కోర్టుకు ఇవ్వాల్సిన వివరణ ఇచ్చికేసులు తొందరగా పరిష్కారం అయ్యేలా చూడాలని అన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఆలస్యం లేకుండా కౌంటర్లు దాఖలు చేయాల్సి ఉంటే వెంటనే దాఖలు చేయాలని సమస్యల పరిష్కారానికి వేగవంతంగా పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని ఈ కార్యక్రమాలలో ప్రభుత్వ ప్రాధాన్యతలను తప్పనిసరిగా నెరవేర్చాల్సిన బాధ్యత మనపై ఉందని అందుకు సంబంధించి న్యాయస్థానాన్ని ఆశ్రయించి ఉంటే ఆ కేసులకు సంబంధించి సకాలంలో స్పందించి తొందరగా పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు.



భూసమస్యలపై గృహనిర్మాణశాఖ అధికారులతో సమీక్షిస్తున్న జేసీ

సొంతింటి కలను నిజం చేసుకోండి



జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న నగర మేయర్ అముద

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్లునిర్మించుకొని సొంతింటి కలను నిజం చేసుకోవాలని నగర మేయర్ ఎస్.అముద కోరారు. గురువారం మేయర్ నగరపాలక సంస్థ పరిధిలో అనుప్పల్లి హౌసింగ్ లేఅవుట్లను సందర్శించారు. లేఅవుట్లో జరుగుతున్న ఇళ్లనిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్లస్థలాలు పొందిన వారంతా నిర్మించుకునేలా చూడాలని హౌసింగ్, అమినిటీ కార్యదర్శులకు సూచించారు. లబ్ధిదారులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించి ఇల్లు వేగంగా నిర్మించుకునేలా చూడాలన్నారు. నిర్మాణంలో ఉన్న పలుగహాలను పరిశీలించారు. రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అర్హులకు ఇంటి స్థలాలు మంజూరు చేసి, ఇళ్లు నిర్మిస్తున్నారని మేయర్ చెప్పారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా

నేడు రెండో విడత నగదు జమ: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాది తోఫా రెండవ విడత నగదు మొత్తాన్ని అర్హులైన లబ్దిదారుల ఖాతాలో జమచేసే కార్యక్రమాన్ని ఈనెల 5న తాడేపల్లి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి కంప్యూటర్‌లో బటన్ నొక్కి పెళ్లి కూతుళ్ళ తల్లులు ఖాతాల్లో జమ చేయనున్నారు. చిత్తూరు జిల్లా సచివాలయం నుండి వీడియా కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం ఉదయం 10:30 గంటలకు ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొంటా రని, ఇందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని కలెక్టర్ సగిలి షన్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

డిఆర్‌డిఏ ప్రాజెక్టుకు స్థల సేకరణ

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని పలు పంచాయతీలలో డిఆర్డిఏ ప్రాజెక్టు స్థలసేకరణకు తహశీల్దార్ లోకనాథ పిల్లై రెవెన్యూ సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలను అభివద్ధి పరచడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం డిఆర్డిఏ ద్వారా మహిళ స్వయం సహాయక సంఘాలు చేతివత్తుల ద్వారా ప్రత్యేకశిక్షణ పొందిన మహిళలకు పరిశ్రమ నెలకొల్పుటకు కావలసిన వనరులు సమకూర్చాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. మండలంలోని చెరుకు, బెల్లం పరిశ్రమ నెలకొల్పుటకు స్థలసేకరణ చేపడుతున్నామని, ఈ పరిశ్రమ నెలకొల్పటకు దాదాపు 5ఎకరాలు అవసరం అవుతుందని చెప్పారు. గంగాధర నెల్లూరు, ఎస్ఆర్ పురం, మండలాల్లో దాదాపు పదివేల ఎకరాలలో చెరుకు సాగు అవుతున్నదని, రైతుల పండించిన చెరుకును నేరుగా కొనుగోలు చేసి, వాటి నుండి బెల్లం తయారు చేసి, వేస్టేజ్ పిప్పితో కప్పులు తయారు చేస్తారన్నారు. ఈపరిశ్రమ ద్వారా మహిళలకు ప్రత్యక్షంగా 500 మందికి పరోక్షంగా 2000మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈపరిశ్రమ కావలసిన భూమిని గుర్తించుటకు శెట్టివానతం కొక్కిరాలకోన ప్రాంతాలలో సర్వే నిర్వహిస్తున్నామని అన్నారు. చిత్తూరు డిఆర్డిఏ సిబ్బంది, మండల సర్వేయార్ మురళి, ఆరే త్యాగరాజులు, ఏపిఎం రోజా, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్ పురం కొక్కిరాల కోన ప్రాంతంలో పరిశీలిస్తున్న తహశీల్దార్

'గ్రానైట్స్'కు కొత్త నిబంధనలు తొలగించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు



గ్రానైట్ క్వారీలను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లాలో అత్యధికంగా క్వారీలు, గ్రానైట్స్ నడుస్తున్నాయని వీటిపై ప్రస్తుత ప్రభుత్వం తాజాగా కొత్త నిబంధనలు తీసుకురావడంతో మూతబడి వేలాది మంది కూలీలు ఉపాధి పోయిందని, ఆ నిబంధనలు తొలగించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. గురువారం యాదమరి మండలపరిధిలో సిపిఎం బృందం పర్యటించింది. ఈ మూడు నెలల వ్యవధిలో జిల్లాలో 200 గ్రానైట్ పరిశ్రమలు మూతపడ్డాయని అన్నారు. ప్రధానంగా గ్రానైట్ పరిశ్రమలను పర్యవేక్షణ ప్రభుత్వ ఆధీనంలో నడిచేది వారు చెల్లించాల్సిన పనులు, కరెంటుఛార్జీలపై ఆయా డిపార్ట్మెంట్లు మైనింగ్, విద్యుత్తు అధికారులు కార్మికులు బాగోవులను లేబర్ అధికారులు చూసేవారని, అయితే ప్రస్తుతం మంత్రి అనుచరులకు ప్రైవేటు ఏజెన్సీకి ఇవ్వడం వలన స్క్వేర్‌ఫీట్‌కి రూ.2వేలు ఉండగా ప్రస్తుతం రూ.6,500లు చేశారని, దీంతో ప్రస్తుతం గ్రానైట్ ప్రజలకు కూడా అందుబాటులో లేకుండా పోయిందన్నారు. ఒకపక్క ప్రభుత్వం పరిశ్రమలను ఆదుకుంటామని చెప్తూనే మరోపక్క రకరకాల కమిషన్ల కోసం ప్రైవేటు ఏజెన్సీలు ఇచ్చి అధికస్థాయిలో పెనాల్టీలు వసూలు చేయడంతో పరిశ్రమలు మూతబడుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈపరిశ్రమల్లో పనిచేస్తున్న వేలాది మంది కార్మికులు వీధిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి గ్రానైట్ పరిశ్రమను ఆదుకొని కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈపర్యటనలో సిపిఎం నాయకులు సురేంద్ర, రాజేష్ పాల్గొన్నారు.

వేగంగా ఇంటిస్థలాలు సిద్ధం చేయండి : జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో అనుప్పల్లి వద్ద జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇంటి స్థలాల కోసం సేకరించిన భూమి చదును చేసే పనులు వారం రోజుల్లో పూర్తిచేసి ఫ్లాట్లు ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు నగరపాలక, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం జాయింట్ కలెక్టర్, నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ, చిత్తూరు ఆర్డీవో రేణుక, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఇతర హౌసింగ్ అధికారులతో కలిసి అనుప్పల్లి లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ.. లేఅవుట్‌లో ఇప్పటికే హౌసింగ్‌స్కీం మంజూరైన లబ్ధిదారులకు వీలైనంత త్వరగా ఇంటిస్థలాలు కేటాయించాలని అన్నారు. ఇంటి స్థలాలు ఏర్పాటు కోసం జరుగుతున్న ల్యాండ్ లెవెలింగ్ పనులను పరిశీలించి వారం రోజుల్లో పనులు పూర్తిచేసి ఫ్లాట్లు ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. వీలైనంత త్వరగా లబ్ధిదారులకు ఇంటి స్థలాల కేటాయించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. హౌసింగ్ కాలనీలో నీటి సరఫరాపై ఆరా తీశారు. శాశ్వత నీటిసరఫరాకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ సుబ్రహ్మణ్యం, డీఈ వెంకటరమణ, నగరపాలక డీఈ రమణ, ఏఈ శ్రీలత, వార్డు అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఇళ్లస్థలాల కోసం సేకరించిన భూములు పరిశీలిస్తున్న జెసి శ్రీనివాసులు

ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

ఏపీ ఎన్జీవో సంఘం డిమాండ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వాహనాలు తనిఖీ చేస్తున్న వాణిజ్య విభాగశాఖ అధికారులపై పలమనేరు ఎమ్మెల్యే వెంకట్ గౌడ్ దురుసుగా ప్రవర్తించడమే కాకుండా భౌతిక దాడి చేసి గాయపరచడం, బూతులు తిట్టడాన్ని ఏపీ ఎన్జీవో సంఘం తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు రాఘవులు కార్యదర్శి రఘు గురువారం ఒక ప్రకటనలో ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న వాణిజ్య పన్నులశాఖ అధికారులపై భౌతికంగా దాడి చేసిన పలమనేరి ఎమ్మెల్యే పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వాణిజ్య విభాగశాఖ అధికారులకు సిబ్బందికి రక్షణ కల్పించాలని కోరారు. అలాగే సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఉద్యోగుల పట్ల దురుసుగా ప్రవర్తించి ఎమ్మెల్యే వెంకటే గౌడపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులను బూతులు తిట్టడంతో పాటు భౌతిక దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా జిల్లా ఉన్నతాధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళా ఉద్యోగిని ఆత్మహత్య





భర్తతో మృతురాలు ద్రాక్షాయని (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక సబ్‌జైల్లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మహిళా ఉద్యోగిని ఆత్మహత్య చేసుకొని మరణించిన సంఘటన గురువారం చిత్తూరు నగరంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు జీవితంపై విరక్తి చెంది మనస్తాపానికి గురై చిత్తూరు సబ్‌జైల్లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ద్రాక్షాయాని (31) ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ వసంత కుమారీ తెలిపారు. మృతురాలికి ఇద్దరు సంతానం ఒక బాబు, పాప ఉన్నారు. మహిళ భర్త చిత్తూరు సబ్‌జైల్లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ప్రమాదంలో మృతి చెందగా కారుణ్య నియామకం కింద ద్రాక్షాయిని జూనియర్ అసిస్టెంట్‌గా నియమించారని తెలిపారు. ఆమె తండ్రి క్యాన్సర్‌వ్యాధితో బాధపడుతున్నారని, మరోపక్క భర్త లేకపోవడంతో గత కొంతకాలంగా మనోవేదన చెంది మనస్థాపానికి గురై జీవితంపై విరక్తి చెంది, పోలీస్ క్వార్టర్స్‌లో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వసంత్ కుమార్ తెలిపారు.

మేనల్లుళ్లలతో నారాయణస్వామికి శిరోభారం

- అసంతృప్తి నేతలకు బుజ్జగింపులు
- ఏకతాటిపైకి అసమ్మతి వర్గ నాయకులు
- ప్రయత్నంలో డిప్యూటీ సీఎం మాజీ పీఏ సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత కొంతకాలంగా సొంత మేనల్లుళ్లే నారాయణస్వామికి శిరోభారంగా తయారయ్యారు. నియోజకవర్గంలో అసమ్మతి వర్గాన్ని కలవడం.. అందరినీ ఏకతాటిపై చేర్చే ప్రయత్నంలో డిప్యూటీ సీఎంతోపాటు మాజీ పీఏ సుబ్రహ్మణ్యం తల మునకలై ఉన్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి వైసీపీ అభ్యర్థిగా టిక్కెట్టు తనకే కావాలని కిందిస్థాయి నాయకుల నుంచి పైస్థాయి నాయకుల వరకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

అసలు కథ ఇదే..!

గత నెలరోజులుగా వెదురుకుప్పం మండలంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ స్థానిక నాయకులతో కలిసి పరిష్కరిస్తూ ముందుకెళు తున్నారు. మరోవైపు సొంత మేనల్లుళ్లు ఆర్.సుబ్రహ్మణ్యం, రమేష్ డిప్యూటీ సీఎం వ్యతిరేక వర్గాన్ని కలుస్తున్నారు. (ఇద్దరు సోదరిల కుమారులే). ఆర్.సుబ్రహ్మణ్యం, రమేష్ ఇద్దరూ ఆయన వద్ద వ్యక్తిగత కార్యదర్శులుగా పనిచేసిన వారే. గత



సీఎంతో డిప్యూటీ సీఎం మేనల్లుడు సుబ్రహ్మణ్యం

కొంతకాలం నుంచి వారిని డిప్యూటీ సీఎం వ్యక్తిగత కార్యదర్శి నుంచి తొలగించారు. దీంతో వారు డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై వారు వ్యతిరేక భావం పెంచుకున్నారు. అయితే ఆయన వ్యతిరేకంగా ఉన్న వారిని కలవడమే పనిగా పెట్టుకున్నారు. ఈ క్రమంలో నారాయణస్వామికి బద్ధ శత్రువుగా భావించే మాజీ ఎంపీ ప్రభుత్వ సలహాదారు (ఎన్నారై) మహాసముద్రం జ్ఞానేందర్‌రెడ్డిని కలిసి శాలువా కప్పి సన్మానించారు. గత శుక్రవారం పాలసముద్రం మండలంలోని ఎంపీపీ శ్యామల భర్త శివప్రకాష్‌రాజును కలిశారు. వైస్ ఎంపీపీ శేఖర్, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరెడ్డి, జడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, కేశవరెడ్డిలను కలిసి మద్దతు కోరినట్లు సమాచారం. గంగాధరనెల్లూరు మండలం సీనియర్ నాయకులు వేల్కూరు బాబురెడ్డి, గుణశేఖర్ మొదలియార్, మాజీ జడ్పీటీసీ సభ్యులు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌లతోపాటు వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లి ఎంపీటీసీ కొత్తపల్లి భాస్కర్‌ను కలిశారు. అసంతృప్తి నేతలు అందరినీ ఒక్కతాటిపై తెచ్చే ప్రయత్నం జరుగుతున్నట్లు సమాచారం. జిల్లాలో ఇద్దరు మంత్రులను కలిసి తనకు గంగాధరనెల్లూరు టిక్కెట్టు ఇవ్వాలని డిప్యూటీ సీఎం మేనల్లుడు ఆర్.సుబ్రహ్మణ్యం కోరినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా రాబోయే ఎన్నికల్లో టిక్కెట్ ఎవరికి ఇస్తారోనని ప్రచారం జరుగుతోంది.

నారాయణస్వామితోనే గుర్తింపొచ్చింది



తల్లిదండ్రులతో సమానమైన మేనమామ గురించి తప్పుగా ప్రచారం చేయడం సరికాదు. ఆయన పైనే పోటీ చేయాలనుకోవడం తప్పు. ఏవైనా కుటుంబ సమస్యలు ఉంటే కూర్చొని మాట్లాడుకొని సర్దుబాటు చేసుకోవాలి. డిప్యూటీ సీఎం నారాయణస్వామి కారణంగానే నియోజకవర్గంలో, రాష్ట్రంలో గుర్తింపు వచ్చింది. గుర్తుపెట్టుకోండి. చరిత్రను మరిచిపోకూడదు.

- భారతి చిన్నస్వామి, తిరుమలయ్యపల్లి సర్పంచ్, వెదురుకుప్పం మండలం



వెదురుకుప్పం నాయకులతో సుబ్రహ్మణ్యం

ప్రజల సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలం గొల్లచీమనపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని గాజిపేట, హరిజనవాడ గాజిపేట, మురారిపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెంకటే గౌడ గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వైఎస్సార్‌సిపి ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను తెలియజేశారు. మురారిపల్లె గ్రామంలో కళావతి అనే మహిళ తన ఇళ్లు గతంలో కురిసిన వర్షాలకు దెబ్బతినడంతో కొత్త ఇళ్లు కట్టుకోవడానికి బిల్లులు పెట్టామని అధికారులు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎమ్మెల్యే సంబంధిత అధికారులను పిలిచి వెంటనే పొజిషన్ పట్టా మంజూరు చేయాలని ఆదేశించారు. వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దయానంద గౌడ్, జిల్లా ఎంపిపిల అధ్యక్షుడు ఎం.రెడ్డెప్ప, తహశీల్దార్ రాజేంద్ర, ఎంపిడిఓ బాలాజీ, మండల సచివాలయ కన్వీనర్ కార్తికేయన్, వైఎస్ఎంపిపి నారాయణస్వామి, సర్పంచ్ ధూన్ని నాగభూషణరెడ్డి పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌పై శిక్షణ



- లోకోస్ యాప్ పై శిక్షణ ఇస్తున్న ఏపీఎం శివ

ప్రజాశక్తి- సోమల: మహిళా పొదుపు సంఘాల లావాదేవీల పారదర్శకతకు ప్రభుత్వం అమలు చేస్తున్న లోకోస్ యాప్‌పై గురువారం స్థానిక వైఎస్ఆర్ క్రాంతిపథం కార్యాలయంలో ఏపిఎం శివ ఆధ్వర్యంలో సంఘమిత్రలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపిఎం మాట్లాడుతూ ఇక పై పొదుపుసంఘాల లావాదేవీలు పారదర్శకంగా నిర్వహించడానికి ఒకే యాప్‌ను అమలు పరచనున్నట్లు తెలిపారు. గతంలో సంఘమిత్రలు ఒక్కొక్కరు ఒక్కో యాప్‌లో లావాదేవీలను నమోదు చేసేవారని ఇకపై ఒకేయాప్‌లో నమోదు చేయాలన్నారు. ఈయాప్ జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ఆధ్వర్యంలో పనిచేస్తుందన్నారు. ప్రధానంగా పొదుపు సంఘాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న ఆర్థిక రుణాలపై పారదర్శకత కలిగి ఉండేలా లోకోస్ యాప్ అందుబాటులోకి వచ్చిందన్నారు. మండల పరిధిలోని అన్ని స్వయం సహాయక సంఘాల డేటాను ఈ యాప్‌లో ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. యాప్ పనితీరుపై శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. వెలుగు సిసిలు, సంఘమిత్రలు, మండల, గ్రామసమాఖ్య లీడర్లు పాల్గొన్నారు.

'మదర్ థెరిసా' ఆధ్వర్యంలో

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని మదర్ థెరిసా విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఈనెల ఏడో తేదీ నుండి 9వ తేదీ వరకు మూడు రోజులపాటు జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు గురువారం తెలియజేశారు. తమ కళాశాల ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపడుతూ ఉంటామని ఇందులో భాగంగానే ఈ క్రికెట్ పోటీలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడాకారులకు భోజన వసతులతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఈ కార్యక్రమం విభాగాధిపతులు కష్ణారెడ్డి, లోకేష్ ఆధ్వర్యంలో ఉంటాయని అన్నారు. ఇందులో మొదటి బహుమతి రూ.20వేలు, రెండో బహుమతి రూ.15 వేలు ప్రకటించామన్నారు. క్రికెట్ పోటీల పోస్టర్లను విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అకాడమిక్ అధికారి రాజేందర్ రెడ్డి, కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జగనన్నకు అండగా నిలవండి: మంత్రి రోజా



ప్రజాశక్తి- నగరి: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే.రోజా అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆమె గురువారం ఏఎన్ కండ్రిగ ఎస్టీ కాలనీ, ఇందిరమ్మ ఇల్లు ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. ఈ ప్రాంతాల్లో మంత్రికి అపూర్వ స్వాగతం లభించింది. ప్రతి గడపలోను నివాసస్తులను మంత్రి ఆప్యాయంగా పలకరించారు. వారికి వైసిపి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని వివరిస్తూ వారికి ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది ద్వారా సమస్యకు పరిష్కార మార్గం చూపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చామని, ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేశామని తెలిపారు. జగనన్నకు అండగా నిలవాలని మమ్మల్ని ఆశీర్వదించాలని కోరారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే తీరుస్తామని భరోసా ఇస్తూ కార్యక్రమాన్ని ముందుకు సాగించారు. లబ్ధిదారులు పథకాలన్నీ పారదర్శకంగానే అందాయని సంతప్తి వ్యక్తం చేశారు. నలుగురు తమకు జ్వరంగా ఉందని మంత్రికి తెలుపగా వెంటనే వైద్యసిబ్బందిని అక్కడకు పిలిపించిన ఆమె సీజనల్ జ్వరాలు వస్తున్నాయి కనుక అందరికి పరీక్షలు చేయాలని మరెవరైనా అనారోగ్యం పాలై ఉన్నా వారికి చికిత్స అందించాలని ఆదేశించారు. మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, సచివాలయ కన్వీనర్ దయానిధి, వేణుబాబు, రామకష్ణ, శశికుమార్ పాల్గొన్నారు.

ఉచిత వేసవి శిక్షణా శిబిరం

గ్రంథాలయ ఛైర్‌పర్సన్ మధుబాల

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని ఈనెల 8వ తేదీ 11 వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ ఛైర్‌పర్సన్ మధుబాల తెలిపారు. ఈశిబిరంలో 6 నుండి 10వ తరగతులలో చదువుతున్న విద్యార్థులకు యోగా, మెడిటేషన్, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రామా, నాటికలు, ఇంగ్లీష్ గ్రామర్, చెస్,క్యారమ్స్ , సంగీతం, డాన్స్, ఇతర అంశాలపై ఉచితంగా శిక్షణ ఇప్పించి ప్రతివారం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని అన్నారు. పిల్లలు గ్రంధాలయాలకు వచ్చేలా, పిల్లలలో పుస్తకపఠనంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకునేలా, సజనాత్మకతను పెంచేందుకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున పిల్లల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం వారి పిల్లలను ఈ ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొనేలా ప్రోత్సహించాల్సిందిగా కోరారు. ఈ సమ్మర్ క్యాంపులో పాల్గొనుటకు ఆసక్తి ఉన్న విద్యార్థులు చిత్తూరులోని మిట్టూరు, బాలాజీ కాంప్లెక్స్‌లోని మొదటి అంతస్తులో వున్న కేంద్ర గ్రంథాలయానికి వచ్చి వారి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యదర్శి ఎన్ఎస్ లావణ్య మాట్లాడుతూ జిల్లాలోని మిగతా గ్రంథాలయాల్లో కూడా సమ్మర్ క్యాంప్ నిర్వహించబడునని కావున సమీపంలో ఉన్న గ్రంథాలయానికి వెళ్లి విద్యార్థులు వారి పేర్లను నమోదు చేసుకోవల్సిందిగా తెలిపారు.

'ఉపాధి' పనులు నాణ్యతగా చేయాలి : ఏపీవో

ప్రజాశక్తి- పాలసముద్రం: మండల పరిధిలో ఉపాధి హామీ పథకంలో చేస్తున్న పనులు నాణ్యతగా చేయాలని ఏపీవో బాల అన్నారు. గురువారం కష్ణ జమ్మాపురం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడుతూ గతంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఒక్కరే వున్నప్పుడు కూలీలు తక్కువగా వస్తున్నారని, ప్రస్తుతం మేట్లు కేటాయించడం వల్ల కూలీలు ఎక్కువగా వస్తున్నారని తెలిపారు. జాబ్ కార్డు ప్రతి కుటుంబానికి నూరు రోజులు పనులు కల్పించే బాధ్యత మనపై ఉందని, మాస్టర్లో తేడాలు వస్తే కఠిన చర్యలు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ త్రీలోక్, కూలీలు పాల్గొన్నారు.


ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఏపీవో బాల

ప్రజాసమస్యలను సత్వరం పరిష్కరించాలి: ఎంపీపీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి యువరాజ్

ప్రజాశక్తి- వికోట: మండలంలోని ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఎంపీపీ యువరాజ్ అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ ప్రాంగణంలోని శ్రీశక్తి భవనంలో గురువారం ఎంపీపీ యువరాజ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు సమావేశంలో తెలియజేసే ప్రజాసమస్యలను పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఇతర ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజాసమస్యలను గుర్తించి ప్రజల నుండి వచ్చే అర్జీలను మండలస్థాయి అధికారుల దష్టికి తీసుకువచ్చి సమస్యల పరిష్కారం కోసం కషి చేయాలన్నారు. సాధారణ సర్వసభ్య సమావేశాలకు మండల అధికారులు తమ పరిధిలో జరుగుతున్న ప్రగతి నివేదికలను పూర్తిసమాచారంతో సమావేశాలకు హాజరుకావాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం విషయంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, అధికారులు మధ్యాహ్న భోజన పథకాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, అంగన్వాడీ పాఠశాలల్లో , ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో ఎలాంటి లోటు ఉండరాదని తెలిపారు. మండల స్థాయిలోని అధికారులు అందరూ వారి శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను పనుల ప్రతిపాదన వివరాలను సభకు తెలియజేశారు. గహనిర్మాణ పథకం అమలులో తప్పనిసరిగా ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు చైతన్యం కలిగించాలని, బిల్లుల చెల్లింపులలో ఎలాంటి ఆలస్యం లేనందున లబ్ధిదారులు అందరు కూడా గహనిర్మాణ పథకాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. గహనిర్మాణ సంస్థకు అవసరమైన ఇంటి నివేశ ధ్రువపత్రాలను సత్వర అందజేయాలని తహశీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య సలహాకమిటీ సభ్యులు గౌస్, వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌రెడ్డి, తమిమ్ ఖాన్, సింగల్ విండో అధ్యక్షులు శ్రీరాములు రెడ్డి, ఎంపీడీఓ మహేష్, తహశీల్దార్ మురళి, అధికారులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

అంతర్రాష్ట్ర నకిలీ పోలీసుల ముఠా అరెస్ట్

రూ.8 లక్షల విలువైన సొత్తు స్వాధీనం


నకిలీ పోలీసు ముఠాను అరెస్టు చూపుతున్న డిఎస్పి సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి- వికోట: అమాయకులను మోసగిస్తూ డబ్బులు కాజేస్తున్న అంతర్రాష్ట్ర నకిలీ పోలీసు ముఠాను గురువారం అరెస్టు చేసినట్లు డిఎస్పి సుధాకర్ రెడ్డి తెలిపారు. కర్ణాటక రాష్ట్రం ములభాగల్‌కు చెందిన శివన్న (57) ములభాగల్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ అందులో నష్టంరావడంతో ఇల్లు గడవడం కష్టంగా భావించి చెడు వ్యసనాలకు బానిస అయ్యాడు. అప్పులవారి ఒత్తిడి చేయడంతో సులభమైన మార్గంలో డబ్బులు సంపాదించాలని దురుద్దేశంతో బెంగళూరుకు చెందిన డానియల్ (50), ములభాగాల్‌కు చెందిన జమీర్ భాష (33), కోలార్ జిల్లాకు చెందిన ఇమ్రాన్ (29) వెంకటేశయ్య శెట్టి (75) ముఠాగా ఏర్పడి శ్రీనివాసపురానికి చెందిన రియాజ్ ఖాన్‌ను వీకోటలో కలిశారు. తమకు స్వామి అనే వ్యక్తి తెలుసునని అతను తన వద్ద ఉన్న రెండు వేల రూపాయలు నోట్లు మార్చుకోవాలనుకుంటున్నాడని అతడికి లక్ష రూపాయలు విలువచేసే 500 రూపాయలు నోట్లు ఇస్తే దానికి బదులుగా అతడు రు.1,20,000 విలువచేసే రు.2,000నోట్లు ఇస్తాడని నమ్మబలికారు. ఈ క్రమంలో గత నెల 27వ తేదీన జమీర్ బాషను డబ్బులు మార్చుకునేందుకు కుప్పం రోడ్డులో ఉన్న దాసర్లపల్లి సమీపం వద్ద పెట్రోల్ బంకు వద్దకు రావాలని తెలిపారు. అనంతరం జనసంచారం అధికంగా ఉంటుందని అక్కడ డబ్బులు మార్చుకోవడం ఎవరైనా చూస్తే ఇబ్బంది కలుగుతుందని అట్రపల్లి క్రాస్ వద్దకు అతన్ని తీసుకెళ్లారు. సంఘటన స్థలానికి నకిలీ డిఎస్పి అవతారమెత్తిన డానియల్ తన బందంతో వెళ్లి వారిని బెదిరించి వారి వద్ద నుంచి రూ.5లక్షలను బలవంతంగా తీసుకుని పారిపోయారు. ఈసంఘటనపై బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.8 లక్షల విలువైన సొత్తును స్వాధీన పరుచుకుని వారిని కోర్టుకు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును చేధించిన సీఐ ప్రసాద్ బాబు, ఎస్సై రాంగోపాల్ ఇతర పోలీస్ సిబ్బందిని డిఎస్పి అభినందించారు.

కొడుకును హత్యచేసిన తండ్రి అరెస్టు


మీడియా సమావేశంలో ముద్దాయిలను చూపుతున్న డిఎస్పీ

ప్రజాశక్తి- శాంతిపురం: కొడుకును హత్యచేసిన తండ్రిని అరెస్టు చేసినట్టు పలమనేరు డిఎస్పీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. రాళ్ళబుదుగూరు పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్పీ మాట్లాడుతూ మండల పరిధిలోని తులసినాయనపల్లి గ్రామానికి చెందిన పెద్దన్న కుటుంబం కాకర్లవంక సమీపంలోని పంటపొలాల్లో ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. పెద్దన్నకు ఇద్దరు కుమారులు వారిలో పెద్దవాడైన ఈశ్వర్ (41) మద్యానికి బానిసై ప్రతిరోజూ తాగివచ్చి ఇంట్లో గొడవపడేవాడు. పదిరోజుల క్రితం కూడా మద్యం తాగి ఇంటికి వచ్చి తండ్రి పెద్దన్నతో ఆస్తిలో వాటాలు పంచాలని గొడవపడి దౌర్జన్యానికి పాల్పడగా తండ్రి అతనిని కర్రతో గట్టిగా కొట్టడంతో అక్కడికి అక్కడే మతి చెందాడు. చుట్టుపక్కల ఎవరూ గమనించక పోవడంతో తమ పొలంలోనే గుట్టుచప్పుడు కాకుండా పాతిపెట్టాడు. ఇంట్లోని వారు అడిగితే ఎక్కడో బయటికి వెళ్లాడని చెప్పేవాడు. రెండో కుమారుడు రమేష్‌కు అనుమానం వచ్చి తండ్రిని నిలదీయడంతో హత్యవిషయం బయటికి పొక్కింది. స్థానికుల సమాచారంతో రాళ్ళబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి రూరల్ సీఐ రియాజ్ అహ్మద్ రాళ్ళబుదుగూరు ఎస్సై డి.మునిస్వామి విచారణ చేపట్టారు. బుధవారం ఈశ్వర్ శవాన్ని బయటికితీసి పంచనామా నిర్వహించారు. నిందితులు ఏ1 పెద్దన్న అలియాస్ ఇట్టప్ప, ఏ2 సురేష్ అలియాస్ కప్పులోడు గ్రామ సర్పంచ్, రెవెన్యూ అధికారి ద్వారా పోలీస్‌స్టేషన్లో లొంగిపోయి నేరాన్ని అంగీకరించారు. కుప్పం రూరల్ సీఐ రియాజ్ అహ్మద్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అక్రమ ఎర్రచందనం పట్టివేత



ప్రజాశక్తి- గంగవరం: తలకోన అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఎర్రచందనాన్ని కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్న వాహనంతో పాటు ఎర్రచందనం స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రతాపరెడ్డి తెలిపారు. గురువారం పోలీసుస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఐ మాట్లాడారు. మండలంలోని నాలుగో జాతీయ రహదారి గండ్రాజుపల్లి పంచాయతీ వద్ద బుధవారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా పలమనేరు నుండి వస్తున్న టయోటా వాహనాన్ని తనిఖీ చేయగా అందులో నాలుగు ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గమనించి ఎర్రచందనంతో పాటు రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ముద్దాయిలు సోమల మండలం చెందిన వినోద్‌కుమార్, ములభాగాలకు చెందిన షేక్ సాకీర్ (29)ను అరెస్టు చేసి విచారించారు. వీరు తలకోన అడవి నుండి ఎర్రచందనం దుంగలను కర్ణాటక అక్రమకంగా అమ్మడానికి తీసుకు వెళుతున్నట్లు తెలిపారు. నాలుగు ఎర్రచందనం రూ.91వేలు ఉంటుందని, రెండు వాహనాలు రూ.2లక్షలు విలువ చేస్తాయని తెలిపారు. అనంతరం ముద్దాయిలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం - వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- శాంతిపురం: రాళ్ళబూదుగూరు పోలీస్‌స్టేషన్ సబ్-ఇన్స్పెక్టర్ డి.మునిస్వామి, సిబ్బందితో కలసి బుధవారం సాయంత్రం శాంతిపురం మండలం, సి.బండపల్లి పంచాయితీ, ముద్దనపల్లి - దాసుమనుపల్లి రోడ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. కుప్పం మండలం, కోనయగుంట గ్రామానికి చెందిన చిన్న తండ్రి కొడుకు సి.సుధాకర్ (28) నుండి అక్రమంగా తరలిస్తున్న కర్నాటక రాష్ట్రం మద్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు. అనంతరం అతన్ని విచారించగా ఆంధ్ర, కర్నాటక బార్డర్, బిసానత్తమ్ సమీపంలోని కర్నాటక రాష్ట్రానికి చెందిన జైమారుతి వైన్స్‌షాపులో క్యాషియర్ తనకు మద్యాన్ని సరఫరా చేసి, చుట్టుపక్క గ్రామస్తులకు ఎక్కువ రేట్లకు అమ్మగా వచ్చిన లాభాల్లో చెరో సగం పంచుకొనేవాళ్ళమని చెప్పాడు. అనంతరం కొనయగుంట గ్రామంలో ముద్దాయిలు దాచి ఉంచిన రూ. 5,25,600 విలువ జేసే 332 లీటర్ల కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం ముద్దాయి సుధాకర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ముద్దాయిగా వున్న మరొక వ్యక్తి పరారీలో ఉన్నాడని అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- శాంతిపురం: కుప్పం- పలమనేరు జాతీయ రహదారిలోని కడపల్లి సమీపంలోని మదనపల్లె క్రాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మతిచెందారు. స్థానికులు రాళ్లబుదూరు పోలీసుల కథనం మేరకు కడపలే గ్రామానికి చెందిన మురుగేష్ (50) ద్విచక్ర వాహనంపై సొంత పనిమీద పోడూరుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో వీకోట వైపు నుంచి కుప్పం పిఎస్ మెడికల్ కళాశాలకు వెళుతున్న కారు కడప సమీపంలోని మాదనపల్లె వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న మురుగేష్ అక్కడికక్కడ మతిచెందాడు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం వంద పడకల ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు రాళ్ళబుదుగురు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సంక్షిప్త వార్తలు

పంట పొలాలపై ఏనుగుల దాడి



ప్రజాశక్తి- పలమనేరు: జల్లిపేట గ్రామంలో బుధవారం రాత్రి గుంపులోని ఆరు ఏనుగులు పంటపొలాలను తొక్కి ధ్వంసం చేశారు. రూరల్ మండలంలోని జల్లిపేట గ్రామానికి చెందిన వాసు అనే రైతుకు చెందిన మామిడి, పనస చెట్లను, ప్రవీణ్ కుమార్ అనే రైతుకు చెందిన బెండ, మామిడి, చిక్కుడు పంట పొలాలను వెంకట్రమణారెడ్డి అనే రైతుకు చెందిన ఎకరా వరిపంట, ఉషా అనే రైతుకు చెందిన అరటి, మామిడి తోటను రెడ్డెప్పరెడ్డి అనే రైతుకు చెందిన టమోటా పంటలను అర్ధరాత్రి సమయంలో ధ్వంసం చేశారు. పొలాల వద్ద నివాసముంటున్న వాసు ఇంటి దగ్గరకు వచ్చి మామిడి తొటలో కొమ్మలను విరిస్తూ ఏనుగుల చేసిన శబ్దాలకు అక్కడున్న రైతులు మేల్కొని భయభ్రాంతులకు గురై పొలాల్లో అగ్గిమంటలు వేస్తూ వెంటనే ఫారెస్ట్ అధికారి రమేష్‌కి సమాచారం అందించారు. ఆయన వెంటనే సిబ్బందితో గ్రామానికి చేరుకుని అక్కడున్న ఏనుగులను అడవిలోనికి మళ్ళించడానికి ప్రయత్నం చేశారు. కానీ ఏనుగులు ఏ మాత్రం కదలకుండా పంటలపైనే తిరుగుతూ ఉన్నాయి. దీంతో అష్టకష్టాలు పడి తెల్లవారుజామున ఏనుగులను అడవిలోనికి మళ్ళించారు. మళ్ళీరాత్రికి ఎటువైపు ఎన్ని ఏనుగులు వస్తాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి జయంతి వేడుకలను ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ జయంతి ఉత్సవాలు ఈనెల 2వ తేదీ నుండి ప్రారంభమై 4వ తేదీ ముగిశాయి. ఉభయదారులుగా మాజీసర్పంచ్ పేట నీరజా రాధాకష్ణారెడ్డిలు వ్యవహరించారు. వారి ఆధ్వర్యంలో స్వామివారి కళ్యాణం వైభవంగా జరిపించారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామి వారికి సుమారు రూ.5లక్షలు విలువ జేసే వెండి తొడుగును తిరుమల జ్యువెలరీ ప్రొప్రైటర్ తిరుమలాచారి విరాళంగా అందజేశారు. అలాగే దేవరకొండ హేమలతా లోకనాథం హైకోర్టు లాయర్ లక్ష రూపాయల విలువచేసే లాకర్‌ను అందజేశారు. ఈమూడురోజుల ఉత్సవాలలో విచ్చేసిన భక్తులకు కార్యనిర్వాహకులు అన్నప్రసాదాలు అందించారు. వినాయక యూత్ సహకారంతో స్వామివార్ల ఉత్సవ విగ్రహాలతో పాటు దాంట్లవారి కులదేవుడైన దేవరెద్దుతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రధాన కార్యకర్త మిట్టపల్లి సుబ్రహ్మణ్యంరెడ్డి నిర్వాహకులు దాంట్ల జయరామిరెడ్డి, బండి నెహ్రూ, బండి ప్రశాంత్, పేట శివశంకర్రెడ్డి, బి.లక్ష్మమ్మ చెంగల్రాయ రెడ్డి, డాక్టర్ దేవరాజులు, మునిరత్నం, దాంట్ల నాగరాజురెడ్డి, డాక్టర్ బండి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాడు - నేడు పనులను వేగవంతం చేయండి

ప్రజాశక- కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు- నేడు పనులను వేగవంతంగా పూర్తిచేయాలని సర్వశిక్షణ అభియాన్ ఈఈ మదుసూధన్ రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్కేఎస్సార్ జూనియర్ కళాశాల, ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాల, జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరంలోపు నాడు -నేడు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యతతో కూడిన పనులు చేయాలని రన్నింగ్ వాటర్‌తో కూడిన టాయిలెట్లు నిర్మాణం చేయాలని సూచించారు. నాడు- నేడు పనులకు ప్రభుత్వం వెంటనే చెల్లిస్తున్నాయని గుర్తు చేశారు. నాడు- నేడు పనులు చేపడుతున్న పాఠశాలల హెచ్ఎంలు పనులపై ప్రత్యేక దష్టి సారించి నాణ్యతా లోపం లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఎస్ఎస్ఏ ఎఈ నాగభూషణం, పాఠశాలల హెచ్ఏంలు పలువురు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి పనిచేయాలి

నియోజకవర్గ పరిశీలకులు షమీం అస్లాం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పార్టీ బలోపేతానికి కషిచేయాలని పూతలపట్టు నియోజకవర్గం పరిశీలకులు షమీం అస్లాం అన్నారు. బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో మండల నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షమీం అస్లాం మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలని, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ ఫలాలను ప్రజలకు తెలియజేసి వారు పార్టీ పక్షాన పనిచేసే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ నారె సోమశేఖర్, ఎంపీటీసీలు హేమచంద్ర, మొగిలయ్య, సర్పంచ్ శ్రీహరి రఘుపతిరాజు, శేఖర్, కిషోర్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వివాహానికి హాజరైన మాజీ మంత్రి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని దాసార్లపల్లిలోని కోదండ రామస్వామి ఆలయంలో కోటిరేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఆనంద్ సోదరుడు వివాహానికి మాజీ మంత్రి అమరనాథ రెడ్డి హాజరయ్యారు. నూతన దంపతులను ఆశీర్వదించి భోజనం చేశారు. అనంతరం మండల పరిధిలోని కడపనత్తం పంచాయతీ పరిధిలోని టీఎన్.కుప్పం గ్రామానికి చెందిన జే.సుధాకర్ గౌడ్ నూతన గహప్రవేశ కార్యక్రమానికి హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల టిడిపి అధ్యక్షులు కిషోర్ గౌడ్, ఉపాధ్యక్షులు సుబ్రమణ్యంశెట్టి, భువనచంద్ర గౌడ్, రాజేష్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు హబ్‌గా ఏపీ

మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు: ఒకప్పుడు దేశం మొత్తానికి ఆహారాన్ని అందించి అన్నపూర్ణగా నిలిచిన ఆంధ్రప్రదేశ్, జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక గంజాయి, మారకద్రవ్యాలు అక్రమ రవాణాకు హబ్‌గా మారిందని మాజీమంత్రి అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ప్రతిఏటా విడుదల చేసే వార్షిక నివేదిక ప్రకారం గంజాయి రవాణాలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో కొనసాగుతోందని వెల్లడైందని అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ సంస్కతి విపరీతంగా పెరిగిపోతున్నదని, యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని అన్నారు. ఉద్యోగాల కల్పనలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఉద్యోగాలు ఎందుకు రావు అనే ప్రశ్నకు సమాధానం చెప్పే దమ్ము ముఖ్యమంత్రికి లేదని ఎద్దేవా చేశారు. **చిత్తూరుఅర్బన్:** జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాలప్రదేశ్‌గా మార్చేశారని తెలుగుయువత నాయకులు కాజూరు రాజేష్ గురువారం స్థానిక టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంతో తెలిపారు. నార్కోటెక్స్ కంట్రోల్ బ్యూరో ప్రతి ఏటా విడుదల చేసే వార్షిక నివేదిక ప్రకారం గంజాయి రవాణాలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో కొనసాగుతుందని ఒకప్పుడు దేశం మొత్తాన్ని ఆహారాన్ని అందించి అన్నపూర్ణగా నిలిచిన ఆంధ్రప్రదేశ్, జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు అబ్ మారిందన్నారు. రాష్ట్రంలో సుమారు 48 లక్షల మంది పట్టభద్రులు ఉన్నా వారిలో కనీసం 70 శాతానికి పైగా మందికి ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోయారని అన్నారు. యువరాజు, గౌతమ్, కన్నా, కార్తీక్, మనీ, నూర్ ,మౌళి తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు గ్రామాల్లో అవగాహన

ప్రజాశక్తి- పెద్దపంజాణి: కర్ణాటక రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నడంతో మండల సరిహద్దు ప్రాంతంలో పటిష్ట బందోబస్తుకు చర్యలు తీసుకున్నట్లు స్థానిక ఎస్సై టి.శ్రీనివాసులు తెలిపారు. గురువారం రాజుపల్లి గ్రామంలో స్థానిక ప్రజలతో మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో జరగబోవు ఎన్నికల్లో దొంగఓట్లు వేసేందుకు వెళ్లకూడదని, అలా వెళ్లిన వారి పైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై టి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సరిహద్దు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే గత ఎన్నికల సమయంలో ఎన్నికల విధులకు ఆటంకం కలిగించిన 9మందిని స్థానిక డిప్యూటీ తహసీల్దార్ ఫణి కుమార్ ఎదుట హాజరు పరిచినట్లు ఎస్సై టి.శ్రీనివాసులు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని కార్మికుల సమస్యలను గుర్తించి మున్సిపల్ కమిషనర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. పలమనేరు మున్సిపల్ కార్మికులతో గురువారం బాపూజీ ఉద్యానవనంలో సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు యస్.నాగరాజు, పలమనేరు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు మద్దెల సుబ్రహ్మణ్య, పలమనేరు పట్టణ ఏఐటీయూసీ కార్యదర్శి బుర్ర మంజునాథ్ బాబులు మాట్లాడారు. పలమనేరు మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని కార్మికుల సమస్యలను గుర్తించి మున్సిపల్ కమిషనర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల చేత పాతపద్ధతి ద్వారా పనిచేసే విధంగా కమిషనర్ చర్యలు తీసుకోవాలని కోరారు.